క్లుప్తంగా

విద్యార్థులకు అభినందనలు



ఏలేశ్వరంలో విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ అబ్బాయి

ఏలేశ్వరం: నవోదయ, బీఆర్ఏజీ సెట్–2024–25 ప్రవేశపరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పట్టణంలో మంగళవారం ఎంఈఓ బి.అబ్బాయి అభినందించారు. సి.రాయవరం గ్రామంలోని ఎంపీపీ పాఠశాల విద్యార్థి బాలిబోయిన శ్రీనివాస్ నవోదయ ప్రవేశపరీక్షకు, బీఆర్ఏసీ సెట్‌కు నాలుగో తరగతి విద్యార్థులు పూర్ణసత్య, గంగాభవాని, లక్ష్మీదుర్గ, సంధ్యారాణి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద వారిని ఎంఈఓ అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రవేశపరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కె.వరలక్ష్మి, హెచ్ఎం సీతమ్మ, ఉపాధ్యాయులు తూమురొతు శ్రీను, ఎర్ర లక్ష్మణరావు, కడింశెట్టి రవి, సత్యవతి, మల్లేశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో పారాయణ

ఏలేశ్వరం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వెంకన్న సన్నిధిలో మంగళవారం మహిళలు పారాయణాలు పఠించారు. పెద్దాపురం మండలం దివిలి సమీపంలోని చినతిరుపతిలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మహిళలు లలితాసహస్ర పారాయణ, శ్రీవిష్ణు సహస్ర పారాయణ, గోవింద నామాలు, భక్తిగీతాలు ఆలపించారు. పరిషత్ ప్రతినిధి కటకం కిరిటీ మాట్లాడుతూ ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు పారాయణాలు పఠిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ పారాయణాలు పఠించడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పరిషత్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పళ్లం రాజును కలిసిన కాంగ్రెస్ పార్టీ నేతలు

ప్రత్తిపాడు రూరల్: కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు పార్లమెంటరీ అభ్యర్థిగా పోటీ చేయనున్న మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజును కాకినాడలో ఆ పార్టీ నేతలు నీరుకొండ సత్యనారాయణ, పీసీసీ సభ్యుడు దరణాలకోట శ్రీను తదితరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పాత రోజులు రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పన వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి కొల్లు వీరగణేష్, ఎస్.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆటిజం డే



ఏలేశ్వరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీచర్లు

ఏలేశ్వరం: పట్టణంలోని భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ ఆటిజం(మూగ) డే ఘనంగా నిర్వహించారు. భవిత కేంద్రం టీచర్లు వాణిపద్మజ, బుజ్జి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు ఆటిజంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మూగ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వారి సైగలను అర్థం చేసుకోవడం ద్వారా సమస్యలు తెలుసుకోవచ్చాన్నారు. వారితో ప్రేమగా మెలగాలన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ..



ఆటిజంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఈఆర్పీలు నాగగోవిందు, నారాయణరావు మాట్లాడుతూ పిల్లలకు వచ్చే ఆటిజం లక్షణాలు, ఆటిజం నుంచి పిల్లలను బయటకు తీసుకొచ్చేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శిశువు జన్మించాక ఏవైనా అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టరును సంప్రదించాలని సూచించారు. ఆటిజం ఉన్నట్టు నిర్ధారణ అయితే డాక్టర్ల సలహా మేరకు మందులు వాడడం, కౌన్సిలింగ్, శిక్షణ ద్వారా మానసిక పరిపక్వత పెంచవచ్చన్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్, స్పీచ్ అండ్ లాంగ్వేజ్ థెరపీ, సైకలాజికల్ కౌన్సిలింగ్, ఫ్యామిలీ కౌన్సిలింగ్‌లతో మంచి ఫలితం ఉంటుందన్నారు. హెచ్ఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట అభ్యర్థిగా శివగణేష్

జగ్గంపేట: అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ జగ్గంపేట అభ్యర్థిగా మరోతి శివగణేష్‌ను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా ఆయన పనిచేశారు. గతంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా జగ్గంపేట నుంచి పోటీ పరాజయం చెందారు.

మొక్కజొన్న.. లాభాలు మిన్న

- మెట్టలో విస్తరిస్తున్న మొక్కజొన్న
- చెరకుకు ప్రత్యామ్నాయంగా సాగు
- క్వింటాల్ ధర రూ.2090
- ఆసక్తి చూపుతున్న రైతులు



కొలిమేరులో ఎగుమతికి సిద్ధంగా ఉంచిన మొక్కజొన్న కంకులు



ఎస్‌బీ పేటలో సాగవుతున్న మొక్కజొన్న

ఫ్యాక్టరీ మూసివేయడంతో..



ఏటా నాలుగైదు ఎకరాల్లో చెరకు సాగు చేసేవాడ్ని. ఫ్యాక్టరీ మూసివేయడంతో రెండేళ్లగా చెరకు సాగు చేయడం లేదు. కంపెనీవాళ్లు విత్తనం సరఫరా చేయడంతో ఈ సంవత్సరం చెరకుకు ప్రత్యామ్నాయంగా రెండెకరాల్లో మొక్కజొన్న వేశాను. ఈ నెలాఖరికి పంట చేతికొస్తుంది. కోతకోస్తే దిగుబడి, ఆదాయం ఎంత వస్తుందో తెలుస్తుంది.

– కె.కొండయ్యనాయుడు, రైతు, ఎస్‌బీ పేట, తుని మండలం

తుని రూరల్: మొక్కజొన్న రైతులు లాభాలను ఆర్జిస్తున్నారు. అనుకున్నస్థాయిలో పంట దిగుబడి రావడంతో ఎక్కువమంది రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంటగా దశాబ్దాల పాటు రైతులు సాగు చేసిన చెరకుకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేపడుతున్నారు. దీంతో రెండేళ్లగా మెట్ట ప్రాంత మండలాలైన తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం, జగ్గంపేట, ఏలేశ్వరం, కిర్లంపూడి, గండేపల్లి, పెద్దాపురంతో పాటు గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లోనూ మొక్కజొన్న సాగు విస్తరిస్తోంది. ఈ ప్రాంతంలో మొక్కజొన్నతో కోళ్లు, ఇతరేతర మేత తయారీ ఫ్యాక్టరీలు నెలకొల్పడంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది. కాకినాడ జిల్లాలో 12 మండలాల్లో 669 మంది రైతులు 1,388 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తుండగా తుని మండలంలోనే 180 మంది రైతులు 499.89 ఎకరాల్లో సాగు చేస్తుండడం విశేషం. ఇందుకు ప్రధాన కారణం ఆరేడేళ్ల కిందటే తాండవ సహకార చక్కెర కర్మాగారం మూసివేయడమే. దీంతో తుని మండలంలో ప్రధానంగా చెరకు పండించే కొలిమేరు, సుభద్రయ్యమ్మపేట, డి.పోలవరం, ఎన్.సూరవరం, నందివంపు తదితర గ్రామాల పరిధిలో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. ఈ సాగు విస్తరణకు ఫ్యాక్టరీ మూత పడడం ఒకటైతే సరైన సాగునీటి వసతులు లేకపోవడం, ఆరుతడిగా మొక్కజొన్న సాగు విస్తరణకు కారణమవుతుంది.

దిగుబడి, గిట్టుబాటు ధర

ఆరుతడి సాగవుతున్న మొక్కజొన్న దిగుబడులు ఆశాజనంగానే ఉన్నాయి. ఎకరాలకు నాలుగు నుంచి ఐదు టన్నులు దిగుబడి లభిస్తుందని ఎస్‌బీ పేట రైతులు తెలిపారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2090 మద్దతు ధర ప్రకటించింది. దీంతో ఎకరా సాగు చేసిన రైతులకు రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు వస్తుంది. ఇందులో పెట్టుబడులు పోగా రూ.50వేలు నుంచి రూ.65వేలు లభిస్తుందని రైతులు పేర్కొన్నారు. ఇప్పుడిప్పుడే పంట పక్వానికి రావడంతో మొక్కజొన్న కంకుల సేకరణ మొదలైంది. ఈ నెలాఖరుకి కంకుల సేకరణ ముమ్మరమయ్యే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన రత్నగిరి ఈఓ



కలెక్టర్‌కు అభినందనలు తెలియజేస్తున్న ఈఓ రామచంద్రమోహన్

అన్నవరం: కాకినాడ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జె.నివాస్‌ను అన్నవరం దేవస్థానం ఈఓ కె రామచంద్రమోహన్ మంగళవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఆయనకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. వేదపండితులు కలెక్టర్‌ను ఆశీర్వదించారు. దేవస్థానంలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను కలెక్టర్‌కు ఈఓ వివరించారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

గొల్లప్రోలు: తాడిపర్తి గ్రామంలో శ్రీమ్ అపర్ణా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని పదో తరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్ ఉచిత శిక్షణ తరగతులు గురువారం సాయంత్రం నుంచి ప్రారంభమవుతాయిని ఆ ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఆకొండి వేంకటేశ్వర శర్మ (బాబి) మంగళవారం తెలిపారు. సుశిక్షుతులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తి ఉన్న విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. 9440341579, 7013460210, 9989527884 నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన రజక సంఘం నాయకులతో మంత్రి దాడిశెట్టి రాజా

తుని: పట్టణ పరిధిలోని 10 వార్డులకు చెందిన రజక సంక్షేమ సేవా సంఘానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. మంగళవారం సాయంత్రం తుని మండలం ఎస్.అన్నవరం మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ పార్టీలకు చెందిన 30 మందికి రాష్ట్ర, రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరామన్నారు. జరగబోయే ఎన్నికల్లో దాడిశెట్టి రాజా విజయానికి కృషి చేస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేస్తే తగిన గుర్తింపు ఇస్తామని మంత్రి రాజా అన్నారు. తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, కౌన్సిలర్లు వాసంశెట్టి శ్రీను, మంతెన గోవిందరాజులు, మొల్లే గణేష్, షేక్ బాబ్జి, కోరుప్రోలు త్రినాథ్, బాబి తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే కూటమి కుటిల రాజకీయం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- మెట్టచింత, ఉలిగోగుల గిరిజన గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



ఉలిగోగులలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు రూరల్: ఓటమి భయంతో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి కుటిల రాజకీయం చేస్తుందని వైఎస్సార్ సీపీ స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని మెట్టచింత, ఉలిగోగుల గిరిజన గ్రామాల్లో మంగళవారం స్థానిక పార్టీ నాయకులతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరుపుల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అవ్వాతాతలు, దివ్యాంగుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ ఇవ్వకూడదంటూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకోవడం దారుణమన్నారు. ఇంత దుర్మార్గమైన బుద్ధి ఉన్న చంద్రబాబు అవ్వాతాతలకు రూ.4 పింఛన్లు ఇస్తానంటే ఎవరైనా నమ్ముతారా అని ప్రశ్నించారు. ఇలాంటి రాబందులను ఓటుతో తరిమికొడదామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛనుదారులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. ప్రతి నెలా వారు గ్రామాల్లోని అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఇతర నగదు ఇవ్వకూడదని చంద్రబాబు ఈసీకి తన అనుచరులతో ఫిర్యాదు చేయించారన్నారు. దీంతో ఈసీ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించకూడదని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇదంతా చంద్రబాబు నిర్వాహకంతోనే జరిగిందని గుర్తు చేశారు. చంద్రబాబు కుట్ర మరోసారి బయట పడిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యుడు దోశే చిట్టిబాబు, పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతల రాజు, స్థానిక పార్టీ నాయకులు కొత్తూరు రమణ, అన్నిక సత్తిబాబు, జల్లిగంపల ప్రభాకర్‌రావు, తుట్టా జమిందార్, పిల్లా చినబాబు, ఉమ్మిడి తాతీలు, శెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీదే విజయం



పార్టీలోకి చేరిన టీడీపీ, జనసేన నాయకులతో తోట నరసింహం

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం

కిర్లంపూడి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. ఎస్.తిమ్మాపురం గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మంగళవారం వీరవరంలోని తోట నరసింహం సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరికి తోట పార్టీ కండువాలు వేసి సాధరంగా ఆహ్వానించారు. గోకవరం మండలం కామరాజుపేట గ్రామ పంచాయతీకి చెందిన శివరామపట్నం వైఎస్సార్ సీపీ నాయకులు తోట నరసింహంను, తోట రాంజీలను మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయంపై వారితో చర్చించారు. మండల పార్టీ ఇన్‌చార్జి తోట బాబ్జీ తదితరులు ఉన్నారు.

పొత్తులు పెట్టుకున్న పార్టీలను నమ్మొద్దు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం



ఆత్మీయసమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం



వైఎస్సార్ సీపీలో చేరిన వారు

జగ్గంపేట: పొత్తులు పెట్టుకున్న పార్టీలను నమ్మితే నట్టేట ముంచుతారని, వారి వల్ల పేదలకు మేలు కన్నా కీడు ఎక్కువ జరుగుతుందని జగ్గంపేట వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట నరసింహం అన్నారు. జగ్గంపేట ఉపసర్పంచి బండారు రాజా ఆధ్వర్యంలో స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతినెలా ఒకటో తేదీన వృద్ధులు, వితంతవులు, వికలాంగులకు వలంటీర్లు ఇళ్ల వద్దకు వెళ్లి అందించే పింఛన్ల పంపిణీని టీడీపీ నేతలు అడ్డుకున్నారన్నారు. పేదల ఉసురు చంద్రబాబుకు తగలకుండా మానదన్నారు. ప్రభుత్వం వద్ద సొమ్ములేక పింఛన్లు ఇవ్వడం లేదని టీడీపీ మరో అబద్ధపు ప్రచారాన్ని చేయడం హాస్యస్పందంగా ఉందన్నారు. నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన జగ్గంపేటను గతంలో స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. డిగ్రీకాలేజీ, ఫైర్ స్టేషన్, పుష్కర ఎత్తిపోతల పథకం, భావవరం మంచినీటి పథకం లాంటి ఎన్నో పథకాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి పథకాలు అమలు చేసి ప్రజల ఆర్థిక భరోసా కల్పించారన్నారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితే జగ్గంపేటను మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. ఎమ్మెల్యేగా తనకు, కాకినాడ పార్లమెంటరీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌కు ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఎన్నికల సమన్వయ కర్త అత్తులూరి సాయిబాబు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మిరఘురాం, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్‌వెస్లీ, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు గఫూర్, సొసైటీ అధ్యక్షుడు బుర్రి చక్రబాబు, వివిధ మండలాల నేతలు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

జగ్గంపేటలో జరిగిన ఆత్మీయ సమావేశంలో జగ్గంపేట టవర్ కాలనీ, మరికొన్ని ప్రాంతాలకు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన వారు గ్రామ ఉపసర్పంచి బండారు రాజా ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ విజయానికి కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. గాలి రత్నకుమారి, నరుకుల ఏసు, ఎర్రంశెట్టి నాగేశ్వరరావు, కొప్పిరెడ్డి వీరబాబు, రాజు, పిండి రాజు ఆధ్వర్యంలో పార్టీ చేరారు.

సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి



ఎల్టీపేటలో పథకాలు వివరిస్తున్న శంకర్‌మల్లిక్

- మంత్రి రాజా తనయుడు శంకర్ మల్లిక్
- ఎల్టీపేటలో ఎన్నికల ప్రచారం

కోటనందూరు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా పాలనను పరుగులు పెట్టిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్‌మల్లిక్ విజ్ఞప్తి చేశారు. ఎల్టీపేటలో మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. అవ్వాతాతలు, మహిళలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగన్‌ను, తుని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న తన తండ్రి దాడిశెట్టి రాజాను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన శంకర్‌మల్లిక్‌కు బాణ సంచా కాల్పులు, డప్పువాయిద్యాలతో పార్టీ నాయకులు స్వాగతం పలకగా మహిళలు హారతులు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, సర్పంచ్ తుమ్మల రాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



శంఖవరంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కిశోర్

శంఖవరం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలందరూ సహకరించాలని అన్నవరం ఎస్సై ఐ.కిశోర్ అన్నారు. గ్రామంలో 100 మంది పోలీసులతో కవాతు నిర్వహించారు. వీధుల్లో తిరుగుతూ ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికలు షెడ్యూల్ విడుదలైన కారణంగా ఎంసీసీ కోడ్ అమలులో ఉందన్నారు. ఈ సమయంలో ఘర్షణ పడడం, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు వంటివి చేయకూడదన్నారు.

సంక్షేమ పాలన సాగాలంటే జగనన్నే మళ్లీ రావాలి



కాత్రావులపల్లిలో ప్రచారం చేస్తున్న తోట వాణి, శ్రీనిధి

జగ్గంపేట: రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ పాలన అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారం చేపట్టాలని జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి వాణి అన్నారు. జగ్గంపేట మండలంలోని కాత్రావులపల్లిలో ఆమె వారి కోడలు శ్రీనిధి, గొల్లలగుంటలో యువనేత తోట రాంజీ ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహం, కాకినాడ పార్లమెంటరీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అన్నారు. కాత్రావులపల్లి ప్రచారంలో నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్త అత్తులూరి సాయిబాబు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, గ్రామ సర్పంచి పిట్టా సుగుణరావు, గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేతలు, గొల్లలగుంటలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

త్వరలో నూతన ప్రభుత్వాస్పత్రి సేవలు ప్రారంభం



గోకవరం ప్రభుత్వాస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ సనత్‌కుమారి

గోకవరం: గ్రామంలో నూతనంగా నిర్మించిన 30 పడకల సీహెచ్‌సీ భవనం సేవలు త్వరలో అందుబాటులోకి రానుందని డీసీహెచ్ఎస్ డాక్టర్ సనత్‌కుమారి తెలిపారు. గోకవరం ప్రభుత్వాస్పత్రిని మంగళవారం ఆమె సందర్శించారు. ఆస్పత్రిలో రికార్డులు పరిశీలించి రోగులకు అందుతున్న సేవల గురించి వైద్యాధికారి డాక్టర్ వనజకుమారిని అడిగి తెలుసుకున్నారు. గత నెలలో ప్రసూతి కేసులు తక్కువ ఉండడంపై ఆరాతీశారు. ప్రసూతి సేవలు పెంచాలని సూచించారు. ఆర్థోపెడిక్ వైద్యుడు ప్రదీప్‌సుందర్ డిప్యూటేషన్‌ను వారంలో అదనంగా మరో రోజు పెంచాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు సత్యానందం విజ్ఞప్తి చేయగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన భవనానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో అందుబాటులోకి రాలేదన్నారు. పది రోజుల్లో విద్యుత్ సౌకర్యం వచ్చే అవకాశం ఉందన్నారు. గుండెపోటుకు గురైన వారికి అత్యవసరంగా ఇచ్చే రూ.50 వేలు విలువైన ఇంజక్షన్ ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులో ఉందని, ఇప్పటి వరకు ఇద్దరిని ప్రాణాపాయం నుంచి కాపాడగలిగామన్నారు. అలాగే ఆస్పత్రిలో అన్ని రకాల వ్యాక్సిన్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వాస్పత్రి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వాహనాలకు టెక్నికల్, బ్రేకల టెస్ట్



వాహనాలకు టెస్ట్‌లు చేస్తున్న సభ్యులు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో రెండో రోజు జరుగుతున్న జాతీయస్థాయి ప్రో–కార్టింగ్ ఎండు రెన్స్ చాంపియన్ షిప్–2024 సీజన్–4 పోటీల్లో మంగళవారం వాహనాలకు టెక్నికల్ టెస్ట్, బ్రేక్ టెస్ట్‌లు నిర్వహించినట్టు కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 13 టీమ్‌లకు గాను 350 మంది సభ్యులు తమ తమ పనుల్లో బిజీగా ఉన్నట్టు పేర్కొన్నారు.

ఆరుగురి అరెస్టు

రౌతులపూడి: శృంగవరంలో రౌతులపూడి ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీసు దాడుల్లో మంగళవారం జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులు పట్టుకున్నారు. వారిలో ఎస్.శివకుమార్, తోట శివయ్య, ములికి దుర్గబాబు, బి.సత్తిబాబు, గుండారపు రాజు, సామన ఏడుకొండలు ఉన్నారు. వీరిని అరెస్టు చేసి వీరి నుంచి రూ.4,200 నగదును స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

శృంగవరంలో కోడిపందాలు నిర్వహిస్తున్న అల్లు లోవరాజును అదుపులోకి తీసుకున్నట్టు రౌతులపూడి ఎస్ఐ జి.వెంకటేశ్వరావు తెలిపారు. కోడిపందాలు నిర్వహిస్తున్న ప్రాంతంలో రెండు కోళ్లు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు. కోడిపందాలు ఆడుతున్న నిందితులు పరారయ్యారని ఆయన వెల్లడించారు.

20లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

రౌతులపూడి: ములగపూడి గ్రామానికి చెందిన యామల బాపనయ్య మంగళవారం 20 లీటర్ల సారాతో పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించనున్నట్టు ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

యువకుడి అదృశ్యం



వీరవెంకట రమణ(ఫైల్)

కిర్లంపూడి: ముక్కొల్లు గ్రామానికి చెందిన యువకుడు తంగెళ్ల వీరవెంకట రమణ అదృశ్యమైనట్టు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్సై తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల వీరవెంకట రమణకు పెళ్లి సంబంధం చూశారు. పెళ్లికి అంగీకరించిన కొద్దిరోజులకు ఇష్టం లేదని చెప్పగా తండ్రి వీరన్న మందలించాడు. గత నెల 16 మధ్యాహ్నం 3 గంటలకు ముక్కొల్లులోని అతని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో యువకుడు తండ్రి తంగెళ్ల వీరన్న మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. యువకుడు ఆచూకీ తెలిసిన వారు 94407 96529, 94409 04834 నంబర్‌లకు సమాచారం ఇవ్వాలని కోరారు.